

భగమాలినీ క్రమంలో భద్రకాళి
శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం భద్రకాళి అమ్మవారికి కపాలినీ, భగమాలినీ క్రమాలలో పూజలు చేశారు.
- 8లో▸



ప్రజల గుండెల్లోనే పీవీ..
చిన్న గ్రామం నుంచి ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగిన గొప్ప మేధావి పీవీ నర్సింహారావు. నేడు పీవీ 104వ జయంతి సందర్భంగా కథనం.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$36^0/25^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఎక్కువ ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

హనుమకొండ జిల్లాలో 89.95%, వరంగల్ జిల్లాలో 60.73% ఉత్తీర్ణత

విద్యారణ్యపురి: ఈనెల 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్ని శుక్రవారం విడుదల చేశారు. హనుమకొండ జిల్లాలో 463 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. వారిలో 416 మంది 89.85 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డీఈఓ డి.వాసంతి తెలిపారు. బాలురు 277 మందికి 249 మంది, బాలికలకు 186 మందికి 167 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో 60.73 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ తెలిపారు.

వర్సిటీ అధికారుల నిర్లక్ష్యంపై లోకాయుక్తలో ఫిర్యాదు

ఎంజీఎం: వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం, ప్రైవేట్, డీమ్డ్ యూనివర్సిటీలకు మేలు చేయాలనే ఒప్పందం, నష్టపోయిన అర్హులైన 400 మెడికల్ విద్యార్థులకు న్యాయం జరగాలని, అవినీతి అధికారులపై విచారణ చేపట్టాలని కోరుతూ వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ లోకాయుక్తలో ఫిర్యాదు చేసింది. ప్రైవేట్ మెడికల్ కాలేజీలు డీమ్డ్ యూనివర్సిటీలుగా మారడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు తప్పనిసరి. అయితే తెలంగాణ ప్రభుత్వ అనుమతి లేకున్నా.. 400 ఎంబీబీఎస్ సీట్లు ఉన్న రెండు ప్రైవేట్ మెడికల్ కాలేజీలు డీమ్డ్ యూనివర్సిటీలుగా మారడం, ఈక్రమంలో గతేడాది అర్హులైన 400 మెడికల్ సీట్లు రాష్ట్ర ప్రభుత్వ పరిధి నుంచి దాటిపోవడంపై జరిగిన అవినీతిపై విచారణ కోసం లోకాయుక్తలో ఫిర్యాదు దాఖలు చేసినట్లు వినియోగదారుల మండలి ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచర్ల సుదర్శన్ తెలిపారు.

మధ్యవర్తిత్వ ప్రత్యేక గవర్నమెంట్ ప్లీడర్‌గా వాణి



వరంగల్ లీగల్: హనుమకొండ జిల్లా కోర్టులో మధ్యవర్తిత్వ కేసుల ప్రత్యేక గవర్నమెంట్ ప్లీడర్ (స్పెషల్ జీపీ)గా న్యాయవాది పోలసాని వాణిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ శాసన - న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. నియామకం మూడేళ్ల వరకు వర్తిస్తుందని, నెలకు రూ.60 వేల గౌరవ వేతనం చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంగెం మండలం గవిచర్ల గ్రామానికి చెందిన పోలసాని వాణి 18 సంవత్సరాల నుంచి న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఆమె జీవిత భాగస్వామి శ్రీనివాసరెడ్డి కూడా న్యాయవాదే. ఈసందర్భంగా వాణి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'పద్మ' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ స్పోర్ట్స్: గణతంత్ర (జనవరి 26) దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఏటా అందించే పద్మ అవార్డుల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ డీవైఎస్ఓ గుగులోతు అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారు, అందుకు సంబంధించిన పత్రికల్లో ప్రచురితమైన ఫొటోలు, నాలుగు సెట్లను రూపొందించి జూలై 25లోగా హనుమకొండలోని ప్రభుత్వ కాకతీయ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న యువజన, క్రీడల కార్యాలయంలో అందజేయాలని కోరారు. అంతేకాకుండా www:https://padmaawards.gov.inలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నిర్ణీత గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులను తిరస్కరించనున్నట్లు పేర్కొన్నారు.

బాలల సంరక్షణే లక్ష్యం



కాజీపేట అర్బన్: బాలల రక్షణే లక్ష్యంగా బాలల సంరక్షణ కేంద్రాలు పని చేయాలని అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. హనుమకొండలోని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హనుమకొండలోని ప్రభుత్వ బాలసదనం, ఫాతిమానగర్‌లోని డివైన్ మెర్సీ, స్పందన మానసిక దివ్యాంగుల కేంద్రాలను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఇన్‌స్పెక్షన్ కమిటీ సభ్యులతో కలిసి తనిఖీ చేశారు. నిబంధనలకు అనుగుణంగా ప్రమాణాలు పాటించాలని, భవనాలకు ఫిట్‌నెస్ కలిగి ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సంస్థల నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ అన్నమనేని అనిల్‌చందర్ రావు, సభ్యుడు సందసాని రాజేంద్రప్రసాద్, ఇన్‌చార్జ్ డీసీపీఓ ప్రవీణ్‌కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

'పట్టు'కు ప్రభుత్వ ప్రోత్సాహం

రాయితీ అందిస్తున్న కేంద్రం



హన్మకొండ: పట్టు పరిశ్రమల స్థాపనకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ఈక్రమంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే వారికి రాయితీని అందిస్తోంది. పట్టు పరిశ్రమ వ్యవసాయ ఆధారిత కుటీర పరిశ్రమ, తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందగలిగే పట్టు పరిశ్రమ చిన్న సన్నకారు రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోంది. మల్బరీ పట్టు పురుగుల పెంపకం రైతులకు మంచి లాభదాయకం. తక్కువ పెట్టుబడితో, తక్కువ సమయంలోనే ఎక్కువ దిగుబడిని పొందవచ్చు. సంప్రదాయ పంటలతో పోలిస్తే పట్టుపురుగుల పెంపకం లాభసాటిగా మారింది. దీనిద్వారా ప్రతి నెలా నికర ఆదాయం పొందవచ్చు. 25 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఒకసారి నాటిన మల్బరీ తోట నుంచి 15 నుంచి 20 ఏళ్ల వరకు ఉపాధి పొందవచ్చు. షెడ్డు నిర్మాణం, మల్బరీ మొక్కలు, ఇతర పరికరాలకు ప్రభుత్వం నుంచి రాయితీని పొందవచ్చు. హనుమకొండ జిల్లాలో 202 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారు. 2025–2026 ఆర్థిక సంవత్సరంలో అదనంగా 175 ఎకరాల్లో మల్బరీ సాగు చేయాలని, 3,19,900 పట్టు గుడ్ల ద్వారా 2,30,328 పట్టు కాయల ద్వారా 38,388 కిలోల పట్టుదారాన్ని ఉత్పత్తి చేయాలని ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు 81 ఎకరాలను మల్బరీ తోట పెంపకానికి గుర్తించారు. ప్రస్తుతం జిల్లాలో 8 మండలాల్లో 51 గ్రామాల్లో 97 మంది పట్టు పరిశ్రమ నిర్వహిస్తున్నారు.

రాయితీ వివరాలు..

పట్టు పరిశ్రమను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రాయితీని అందిస్తోంది. మల్బరీ తోటల పెంపకానికి రెండు ఎకరాలకు రూ.60 వేలు సహాయాన్ని రాయితీ రూపేణా అందిస్తోంది. పట్టు పురుగుల పెంపకానికి గది నిర్మాణానికి రూ.2.25 లక్షలు, స్టాండ్స్, ఇతర పరికరాలకు రూ.37,500, రోగ నిరోధక చర్యలు, క్రిమి సంహారక మందుల కోసం రూ.2,500, నీటి పారుదల కోసం రూ.50 వేలు రాయితీగా ప్రభుత్వం అందిస్తోంది. అదే విధంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మల్బరీ తోట నాటుట, నిర్వహణకు రూ.41,500, షెడ్డు నిర్మాణానికి 1,03,040 చెల్లిస్తోంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు మల్బరీ తోట పెంపకం, నిర్వహణకు రూ.78 వేలు, షెడ్ నిర్మాణానికి రూ.2,92,500, రేరింగ్ పరికరాలకు రూ.26,610, రేరింగ్ స్టాండ్స్‌కు 24,140, రోగ నిరోధక చర్యలు, క్రిమి సంహారాలకు రూ.3,250, నీటి పారుదల సదుపాయానికి రూ.65 వేలు రాయితీగా చెల్లిస్తోంది.





మల్బరీ తోట (ఇన్‌సెట్‌లో) పట్టు పురుగులు

పట్టు పరిశ్రమతో ఆర్థికాభివృద్ధి



పట్టు పరిశ్రమతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు. ఇది మంచి లాభదాయక పంట. పట్టు పరిశ్రమ చేపట్టేందుకు ప్రభుత్వం రాయితీని అందిస్తోంది. ఈ రాయితీతో తక్కువ ఖర్చుతో పట్టు పరిశ్రమ నడుపవచ్చు. ప్రతీ నెల నికర ఆదాయం వస్తుంది. ప్రభుత్వం అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకుంటూ రైతులు పట్టు పరిశ్రమ వైపు ముందుకు రావాలి.

- జి.అనసూయ, హనుమకొండ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి

వివస్త్రను చేసి.. జననాంగంలో జీడిపోసి..



వివాహితపై దాడి

- వివాహేతర సంబంధం పెట్టుకుందన్న కారణంతోనే..
- ఘటన జరిగి ఐదు రోజులు
- తాటికాయల గ్రామంలో అమానవీయం

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో ఐదు రోజుల క్రితం ఓ అమానవీయ ఘటన జరిగింది. ఓ వివాహితను వివస్త్ర చేసి జననాంగంలో జీడిపోసి విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడికి వివాహేతర సంబంధం కారణం కాగా, బాధిత మహిళ ఆచూకీ ఇప్పటివరకు బంధువులకు లభించలేదని సమాచారం. ఈఘటనకు సంబంధించి 'సాక్షి'కి అందిన ఎక్స్‌క్లూజివ్ సమాచారం మేరకు.. తాటికాయల గ్రామానికి చెందిన ఓ యువతిని పదేళ్ల క్రితం ములుగు మండలం బోలోనిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు. అతడికి సమీప బంధువైన ఓ వివాహితతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఆ మహిళతో కలిసి సుమారు పది రోజుల క్రితం ఎటో వెళ్లిపోయారు. దీంతో సదరు వ్యక్తి భార్య తనకు జరిగిన అన్యాయాన్ని స్వగ్రామమైన తాటికాయలకు వచ్చి తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు కోపంతో రగిలిపోయి లేచిపోయిన ఆ ఇద్దరిని వెతికి ఐదు రోజుల క్రితం తాటికాయల గ్రామానికి తీసుకొచ్చి విచక్షణారహితంగా దాడి చేశారు. ఇద్దరికి గుండు గీయించారు. ఆ మహిళను ఓ మంచానికి కట్టేసి వివస్త్రను చేసి.. జననాంగంపై జీడీ (పూర్వకాలంలో నొప్పి తగ్గించేందుకు వాడేవారు, అదేవిధంగా శరీరంలోని సున్నిత అవయవాలపై పోస్తే పుండ్లు అవుతాయి) పోశారు. 'తప్పు చేశాను.. క్షమించండి' అని బాధిత మహిళ వేడుకున్నా.. పలువురు ఇష్టారీతిన దాడి చేశారు. యోనిలోంచి తీవ్ర రక్తస్రావమవుతున్నా వదల్లేదు. తర్వాత ఆఇద్దరిని ఏం చేశారో ఆచూకీ తెలియలేదు. ఈ అమానవీయ ఘటన జరిగి ఐదు రోజులు గడుస్తున్నా పోలీసులకు సమాచారం అందలేదని తెలిసింది. అసలు ఆ ఇద్దరు ప్రాణాలతో ఉన్నారో, లేదో తెలియని పరిస్థితి.

సౌదీలో చిక్కుకున్న కొప్పూరు వాసి

- స్వదేశానికి తీసుకురావాలని ప్రవాసీ ప్రజావాణిలో కుటుంబీకుల వేడుకోలు


లక్డీకాపూల్: సౌదీ ఎడారిలో చిక్కుకుని దుర్భరజీవనాన్ని సాగిస్తున్న తన భర్తను కాపాడి స్వదేశానికి తీసుకురావాలని ఓ భార్య మొర పెట్టుకుంది. ఈమేరకు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రవాసీ ప్రజావాణిలో విన్నవించింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాళ్లపల్లి ఈశ్వర్ భార్య లత తన ఇద్దరు కూతుళ్లతో ప్రజాభవన్‌కు వచ్చింది. 'ఈశ్వర్ కుటుంబం భవిష్యత్ కోసం 2017లో సౌదీ అరేబియాకు వెళ్లాడు. అక్కడ మొదట హౌస్ డ్రైవర్‌గా పని చేశాడు. కొద్ది నెలల్లోనే పని కోల్పోయి నిరాశ్రయుడయ్యాడు. మండే ఎండల్లో.. ఖర్జూర తోటలో కూలీగా చేరి అక్కడే చిక్కుకుపోయాడు. స్వదేశానికి చేరే మార్గం తెలియక ఏడేళ్లుగా కుమిలిపోతున్నాడు. అఖామా, వీసా గడువు ముగిసిపోయింది. సౌదీ పాస్‌పోర్ట్ అధికారుల వద్ద జమ చేయడం వల్ల ఈశ్వర్ ఖర్జూర తోటలో కూలీగా చేరాడు. ఎలాగైనా నా భర్తను స్వదేశానికి తీసుకురావాలి' అని ఈశ్వర్ భార్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేడుకుంది. ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి సహకారంతో ఈమేరకు ఆమె ప్రవాసీ ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జీఏడీ ఎన్నారై అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా.. సౌదీ నుంచి స్వదేశానికి పంపించడంలో ఎదురయ్యే ఇబ్బందులను తొలగించడానికి ఇప్పటికే కరీంగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త మొహమ్మద్ జబ్బార్ సహాయాన్ని అర్థించామని లత పేర్కొంది. ఈక్రమంలో రియాద్‌లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదించి ఈశ్వర్‌ను స్వదేశానికి రప్పించాలని ఆమె తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.



హైదరాబాద్ ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రవాసీ ప్రజావాణిలో తన భర్తను స్వదేశానికి తీసుకురావాలని వినతిపత్రం ఇస్తున్న లత

ఆర్గనైజ్డ్ క్రైమ్స్‌పై దృష్టి పెట్టండి

వరంగల్ క్రైం: ఆర్గనైజ్డ్ క్రైమ్స్‌కు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ టాస్క్‌ఫోర్స్ అధికారులను ఆదేశించారు. సీపీ శుక్రవారం టాస్క్‌ఫోర్స్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా టాస్క్‌ఫోర్స్‌లో పని చేస్తున్న అధికారులు, సిబ్బందిని విధులు, బాధ్యతలపై ఆరా తీశారు. బలమైన ఇన్‌ఫార్మర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నమ్మకం కలిగేలా పనిచేయాలని సూచించారు. ఈసందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ సీపీకి పూలమొక్కతో స్వాగతం పలికారు.



టాస్క్‌ఫోర్స్ అధికారుల వివరాలు తెలుసుకుంటున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

మహిళా డెయిరీ ఏర్పాటుకు చర్యలు

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పక్కన హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్యశారద

హన్మకొండ అర్బన్: పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు కావాల్సిన చర్యలు సత్వరమే చేపట్టాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులకు సూచించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో శుక్రవారం పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు సంబంధించిన వివిధ అంశాలపై హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్యశారద, అధికారులతో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి సమీక్షించారు. ఈసందర్భంగా డెయిరీ భవన నిర్మాణం, పాల సేకరణ, డెయిరీ ద్వారా పాల సరఫరా, మౌలిక వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలు గురించి ఎమ్మెల్యే, కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మిల్క్ సెంటర్ల ఏర్పాటు, రవాణా, సొసైటీ ఏర్పాటు, మార్కెటింగ్, చెల్లింపులు, తదితర అంశాలపై అధికారులు ప్రణాళిక రూపొందించాలన్నారు. సమావేశంలో హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల డీఆర్డీఓలు మేన శ్రీను, కౌసల్య దేవి, సహకార అధికారులు సంజీవరెడ్డి, లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారుల భద్రతపై తనిఖీలు

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్ : రహదారుల భద్రతా చర్యల్లో భాగంగా జిల్లాలో ప్రతీ 15 రోజులకు ఒకసారి ఆర్ అండ్‌బీ, పోలీస్, జాతీయ రహదారులు, జీడబ్ల్యూఎంసీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్.. ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రహదారుల భద్రత చర్యలపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర రహదారుల్లో రద్దీ, ప్రమాదకర ప్రాంతాలు, క్రిటికల్ జంక్షన్లను గుర్తించి సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కటాక్షపూర్ వద్ద నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు రేడియంతో కూడిన సైన్ బోర్డులు, ట్యాంకర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ఆ జాబితాను అందజేయాలన్నారు. ప్రమాదాల నివారణకు మూతలు లేని, నిర్మాణ పనులు జరుగుతున్న చోట్ల, మ్యాన్‌హోల్స్ వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేశ్ బాబు, నేషనల్ హైవేస్ ఈఈ మనోహర్, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రమేశ్‌రాథోడ్, నారాయణ, అడిషనల్ ఏసీపీ ప్రభాకర్‌రావు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్, చిత్రంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, తదితరులు

అమ్మ పేరిట ఒక మొక్క నాటుదాం



మొక్కలు నాటుతున్న నాబార్డ్ ఏజీఎం, డీసీఓ తదితరులు

- నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, డీసీఓ సంజీవరెడ్డి

కమలాపూర్: అమ్మ పేరిట తలా ఒక మొక్క నాటుదామని నాబార్డ్ ఏజీఎం ఎల్.చంద్రశేఖర్, డీసీఓ బి.సంజీవరెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ సహకార సంఘ వారోత్సవాల్లో భాగంగా కమలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గూడూరు వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి రైతులతో కలిసి సుమారు 77 మొక్కలు నాటారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరాన్ని సహకార సంఘాల సంవత్సరంగా ప్రకటించిందని, దీంతో 'ఏక్ పేడ్ మా కీ నామ్' నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రకృతి సమతుల్యత కోసం మొక్కలు నాటాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలంటే మొక్కల పెంపకం తప్పనిసరన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనల మేరకు రైతులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆడిట్ అధికారి కె.కోదండరాములు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అజహరుద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, డైరెక్టర్లు తక్కళ్లపల్లి సత్యనారాయణరావు, భావని రాజేశ్వర్ రావు, మౌటం రమేశ్‌బాబు, కుమారస్వామి, ఏటి రాజ్‌కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు అంకతి సాంబయ్య, పాక లక్ష్మీరవీందర్, సంఘ కార్యదర్శి చోటే మియా, ఏఈఓలు, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలిస్తూ.. ప్రశ్నిస్తూ

- ఎన్ఎంసీ షోకాజ్ నోటీసులతో ఆస్పత్రులను సందర్శించిన పర్యవేక్షణ కమిటీ
- కేఎంసీ, ఎంజీఎం, సీకేఎం, జీఎంహెచ్ ఆస్పత్రుల తనిఖీ
- సమస్యలను రాతపూర్వకంగా ప్రభుత్వానికి పంపించండి..
- పర్యవేక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ సంగీత సత్యనారాయణ
- ఎంజీఎంలో ఫార్మసీ సూపర్‌వైజర్ సస్పెన్షన్‌కు ఆదేశాలు

ఎంజీఎం : నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎన్ఎంసీ) మెడికల్ కాలేజీల్లో వసతులపై జారీ చేసిన షోకాజ్ నోటీసుల నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పర్యవేక్షణ కమిటీ శుక్రవారం నగరంలోని కేఎంసీ, ఎంజీఎం, సీకేఎం, జీఎంహెచ్ ఆస్పత్రులను తనిఖీ చేసింది. పర్యవేక్షణ కమిటీ చైర్మన్, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ.. హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్యశారదతో కలిసి ముందుగా కాకతీయ మెడికల్ కళాశాల(కేఎంసీ)ను సందర్శించారు. బోధన సిబ్బంది, పరికరాల లేమిపై ఆయా విభాగాధిపతులతో సమీక్షించారు. కేఎంసీలో హెమటాలజీ విభాగాన్ని, వైద్యవిద్యార్థుల వసతి గృహాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెడికల్ కళాశాలను, ప్రస్తుతం ఉన్న వైద్య అధ్యాపకుల పోస్టుల ఖాళీలు, మౌలిక వసతులపై ప్రభుత్వానికి నివేదించేందుకు పలు అంశాలపై చర్చించారు.



కేఎంసీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో డాక్టర్ మోహన్‌దాస్, కేఎంసీ ప్రిన్సిపాల్ రాంకుమార్‌తో మాట్లాడుతున్న సంగీత



ఎంజీఎం ఓపీ కౌంటర్‌లో చీటీ తీసుకున్న మహిళతో మాట్లాడుతున్న సంగీత

పీఎంఎస్ఎస్‌వై ఆస్పత్రి పరిశీలన..

కేఎంసీ ప్రాంగణంలోని పీఎంఎస్ఎస్‌వై ఆస్పత్రిని కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డయాలసిస్ యూనిట్‌తోపాటు ఆపరేషన్ థియేటర్, యూరాలజీ విభాగాన్ని తనిఖీ చేశారు. పలు అంశాలపై ఆయా విభాగాల వైద్యులతో మాట్లాడి సమస్యలు వివరిస్తున్న క్రమంలో వసతుల లేమిపై ప్రభుత్వానికి రాత పూర్వకంగా నివేదించాలని ఆదేశించారు. పరికరాల మరమ్మతులో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. చిన్న చిన్న సమస్యలతో రోగులకు సేవలు నిలిపేయకుండా చూడాలన్నారు. అనంతరం కేయూ జంక్షన్‌లోని క్షయ ఆస్పత్రిని సందర్శించి రోగులు, ఓపీ సేవల గురించి ఆరా తీశారు. మెడికల్ వ్యర్థాలను ఎక్కడికి తరలిస్తున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు.



కేఎంసీలో వివిధ విభాగాల వైద్యులతో సమీక్షిస్తున్న రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత, చిత్రంలో హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్యశారద, వైద్యాధికారులు

ఎంజీఎంలో ఫార్మసీ సూపర్‌వైజర్‌పై చర్యలకు ఆదేశాలు

ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఎంజీఎం ఆస్పత్రిని సాయంత్రం కమిషనర్ డాక్టర్ సంగీతసత్యనారాయణ సందర్శించారు. మొదట ఓపీ విభాగాన్ని పరిశీలించి కౌంటర్లు పెంచాలని ఆదేశించారు. ఫార్మసీ విభాగంలో ఈ–ఔషధి నమోదులో వివరాలు చెప్పడంలో విఫలమైన ఫార్మసీ సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రోగులకు అందించే భోజనశాల, పిల్లల విభాగాన్ని పరిశీలించి ఆరోగ్య మహిళ పథకం ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. అదేవిధంగా సీకేఎం ఆస్పత్రిని సందర్శించి ఆయా వార్డులు, ఓపీ సేవలు, రెఫరల్స్, ఫాలోఅప్ వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ కిశోర్, హనుమకొండ, వరంగల్ డీఎంహెచ్ఓలు అప్పయ్య, సాంబశివరావు, ఆర్ఈహెచ్ సూపరింటెండెంట్ భరత్, సీకేఎం ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

హాజరుశాతంపై చర్యలు తప్పవు..

నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం వైద్యుల హాజరుశాతాన్ని ఫేస్ బయోమెట్రిక్‌తో చేపట్టాలని కమిషనర్.. వైద్య ఆరోగ్యశాఖాధికారులకు స్పష్టం చేశారు. దీనిపై ఎంజీఎం సూపరింటెండెంట్ స్పందించి అలాంటి హాజరుశాతం ఎంజీఎంలో మొదలు కాలేదని సాంకేతిక కారణాలు చెప్పగా, బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరి అని ఆదేశించారు. భవిష్యత్‌లో వైద్యుల హాజరుశాతంపై బయోమెట్రిక్ ఆధారంగా చర్యలు ఉంటాయని ఆమె స్పష్టం చేశారు.

క్లుప్తంగా

టీజీ ఎన్పీడీసీఎల్‌లో బదిలీలు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో బదిలీలు, సర్దుబాట్లు జరిగాయి. ఈ మేరకు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఫైనాన్స్ సీజీఎం వంటేరు తిరుపతి రెడ్డి డైరెక్టర్‌గా నియామకం కావడంతో ఖాళీ అయిన స్థానంలో సీజీఆర్ఎఫ్ వరంగల్ ఫైనాన్స్ మెంబర్‌గా కొనసాగుతున్న ఆర్.చరణ్‌దాస్‌ను పూర్తి స్థాయి అదనపు బాధ్యతలతో నియమించారు. సిరిసిల్ల సెస్‌కు ఫారిన్ డిప్యుటేషన్‌పై వెళ్లిన పి.విజేందర్ రెడ్డి అక్కడి నుంచి సెలవుపై వెళ్లి తిరిగి ఎన్పీడీసీఎల్‌లో విధుల్లో చేరాడు. ప్రస్తుతం ఆయనను మహబూబాబాద్ ఎస్ఈగా నియమించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.సుదర్శన్‌ను నిర్మల్ నుంచి జగిత్యాలకు బదిలీ చేశారు. ఎస్ఈ వి.గంగాధర్‌ను మంచిర్యాల నుంచి పెద్దపల్లికి, జీఎం వి.వేణుమాధవ్‌ను కార్పొరేట్ ఆఫీస్ ప్రాజెక్టు నుంచి జీఎం ప్లానింగ్‌కు బదిలీ చేశారు. కార్పొరేట్ ఆఫీస్‌లో ఆపరేషన్ జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్న ఉత్తమ్.. మంచిర్యాల ఎస్ఈగా, జగిత్యాల ఎస్ఈ సాలియా నిర్మల్ ఎస్ఈగా బదిలీ అయ్యారు. తొర్రూరు డీఈ జి.మధుసూధన్‌ను మెట్‌పల్లికి, కార్పొరేటర్ ఆఫీస్ డీఈ జి.ఎల్.మర్రెడ్డిని అదే ఆఫీస్‌లో ప్రాజెక్టు విభాగానికి, డీఈ మహబూబాద్ బి.పెద్దిరాజంను వరంగల్ డీపీఈ డీఈగా, పెద్దపల్లి ఎస్ఈ కార్యాలయంలో డీఈ టెక్నికల్‌ను తొర్రూరు డీఈగా, కార్పొరేట్ ఆఫీస్‌లో ప్రాజెక్టు డీఈ డి.నందరాథోడ్‌ను ప్రాజెక్టు నుంచి ఇంజనీరింగ్ డీఈగా బదిలీ చేశారు. కాపులకనపర్తి ఏడీఈ నరసింహారావును కార్పొరేట్ ఆఫీస్ ప్రాజెక్టు విభాగానికి, ఏడీఈ బి.రవిని ప్రాజెక్టు నుంచి కాపుల కనపర్తికి, ఏడీఈ బి.శ్రీనివాస్ యాదవ్‌ను భూపాలపల్లి క్వాలిటీ కంట్రోల్ నుంచి కార్పొరేట్ ఆఫీస్‌కు, ఏడీఈ కె.పవన్ కుమార్‌ను కార్పొరేట్ ఆఫీస్ నుంచి హెచ్‌టీ మీటర్స్ వరంగల్ సర్కిల్‌కు బదిలీ జరిగింది. అకౌంట్స్ జనరల్ మేనేజర్ ఎన్.దేవేందర్‌కు సీజీఆర్ఎఫ్ వరంగల్ ఫైనాన్స్ మెంబర్‌గా స్థానం చలనం కలిగింది. రెవెన్యూ జీఎం ఆర్.కృష్ణ మోహన్‌ను ఫైనాన్స్ జీఎంగా, ఆడిట్ జీఎం ఎస్.సత్యనారాయణను రెవెన్యూ జీఎంగా, ఫైనాన్స్ జీఎం వి.వేణు బాబును ఆడిట్ జీఎంగా బదిలీ చేశారు.

కూరగాయల విత్తనాల పంపిణీ



మామునూరు: ఖిలావరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక (ఎస్‌సీఎస్‌పీ) పథకాల ఆధ్వర్యంలో శుక్రవారం వర్ధన్నపేట మండలం అంబేడ్కర్ నగర్‌కు చెందిన 35 మంది మహిళా రైతులకు కూరగాయల విత్తనాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృషి విజ్ఞానకేంద్రం కోఆర్డినేటర్ రాజన్న హాజరై మాట్లాడారు. చిన్నపాటి వ్యవసాయ పనిముట్లు మహిళలకు కలిగే శ్రమను తగ్గించి పొలాల్లో కలుపు నివారణ పనులు సులభతరం చేస్తాయని తెలిపారు. కూరగాయల విత్తన కిట్లను ఇంటి ప్రాంగణంలో లేదా కంచెల వెంట నాటడం ద్వారా ఆహార భద్రత మెరుగు పడి గ్రామీణ మహిళల జీవనోపాధి స్థిరత్వానికి తోడ్పడుతుందని వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ సాయి కిరణ్, డాక్టర్ గణేష్, రైతులు పాల్గొన్నారు.

ఆషాఢం వేడుకల వేళ..

భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతలకు పూజలు
- అమ్మవార్లకు మొక్కుల చెల్లింపులకు సిద్ధం
- తొలిఏకాదశి నాడు బీరన్న బోనాలు ప్రత్యేకం
- గురువారం ప్రారంభమైన మాసం





హన్మకొండ కల్చరల్: ఆషాఢం వేడుకలకు సమయం ఆసన్నమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తొలకరి వానలు పలకరించాయి. ఫలితంగా పంటల సాగుతో పాటే గ్రామ దేవతల (బోనాలు)కు పూజలు మొదలు కానున్నాయి. ఆషాఢ మాసం గురువారం ప్రారంభమైంది. ఇదే సమయంలో గ్రామాల్లో అమ్మవారిని కొలిచేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. మహిళలు కలిసికట్టుగా బయలుదేరి మొక్కులు చెల్లించనున్నారు. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలిఏకాదశి నాడు బీరన్న బోనాలు వైభవంగా నిర్వహిస్తారు. ఆషాఢ మాసంలో ప్రతీరోజు గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. కొందరికి గ్రామదేవతలకు బోనాలు సమర్పించే సంప్రదాయం కూడా ఉంది. ఇలవేల్పులైన అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తారు.

ఆలయాల్లో ఉత్సవాలు..

ఆషాఢ మాస శుద్ధ ఏకాదశి రోజున విష్ణువు యోగా నిద్రలోకి వెళ్లిన రోజుగా భావిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇదే సమయంలో పూరి జగన్నాథ రథయాత్ర, గురుపౌర్ణమిని వ్యాస పౌర్ణమిగా వేడుకగా జరుపుకోనున్నారు. అలాగే, వరంగల్ జిల్లాలో శ్రీభద్రకాళి అమ్మవారికి శాకంబరీ ఉత్సవాలు నిర్వహించడం ప్రత్యేకం.

గోరంటాకు మురిపెం.. ఆరోగ్యదాయకం

వర్షకాలం ప్రారంభమై బావులు, వాగులు, చెరువుల్లోకి కొత్త నీరొస్తుంది. ఇది చర్మవ్యాధులు వ్యాప్తి చెందే కాలం. వీటి బారి నుంచి ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు గోరింటాకు ఔషధంగా పని చేస్తుంది. ఈ నేపథ్యంలోనే ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకును (మెహందీ) అలంకరించుకోవడం సంప్రదాయంగా వస్తోంది. ఆయుర్వేద వైద్య నిపుణులు గోరింటాకు చర్మ వ్యాధుల నుంచి రక్షణ ఇస్తుందని, శరీరంలో వేడి తగ్గిస్తుందని పేర్కొంటున్నారు.

ఆరోగ్యం.. ఆనందం

హిందూ సనాతన ధర్మంలో ఆరోగ్యం, ఆనందం కోసం కొన్ని పద్ధతులు అనాదిగా వస్తున్నాయి. ఇందులో కుంకుమ, తిలకం అద్దుకోవడం, విభూదిధారణ, గంధ ధారణ, కాటుక, గోరింటాకు పెట్టుకోవడం లాంటి పద్ధతులు ఉన్నాయి. ఆయుర్వేదం ప్రకారం గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరంలో ఉన్న వేడి తగ్గి ఆరోగ్యంగా ఉంటామని, అలాగే శరీరం కళకళలాడుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, వేయిస్తంభాల దేవాలయం ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు.



వనభోజనాల సందడి..

ఆషాఢ మాసంలో వనభోజనాలు ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు. ప్రధానంగా గ్రామాల్లోని వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు వెల్లివిరియాలని కోరుకుంటారు. గ్రామదేవతలకు పూజలు నిర్వహించి ప్రకృతి ఒడిలో పచ్చని పంట పొలాల మధ్య చెట్ల కింద సామూహిక వనభోజన సంబురాలు జరుపుకుంటారు. పట్టణ ప్రాంతాల్లో సైతం ఈ సంప్రదాయం కొనసాగుతోంది.

గోరింటాకు వేడుకలు



గోరింటాకు చూపుతున్న మహిళలు

హసన్‌పర్తి: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గోరింటాకు వేడుకలను మహిళలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని 55వ డివిజన్ సత్యసాయి కాలనీలో అతివలు అరచేతిలో గోరింటాకు పెట్టుకుని మురిసిపోయారు. కార్యక్రమంలో తుమ్మ వనమాల, ఎర్రబెల్లి సుజాత, చెరుకు కృష్ణవేణి, చిట్టిరెడ్డి మంగ పూల్లారి సరోజన, లావణ్య, చింత జ్యోతి, తుమ్మ ప్రియాంక, తుమ్మ పద్మ నిహాసి పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, తదితరులు



కపాలినీ, భగమాలినీ క్రమాలలో భద్రకాళి





కపాలినీ అలంకరణలో అమ్మవారు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారికి కపాలినీ, భగమాలినీ క్రమాలలో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు ఉదయం 4 గంటల నుంచి సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన, చతుఃస్థానార్చన తదితర పూజలు నిర్వహించారు. దశ మహావిద్యల్లోని కాళీక్రమాన్ని అనుసరించి స్నపనబేరాన్ని కపాలినిగా, షోడశీక్రమాన్ని అనుసరించి భోగబేరాన్ని భగమాలినిగా అలంకరించి నవరాత్ర విశేష పూజలు జరిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు జరుపుకున్నారు. సినీ నటులు కొణిదెల నాగబాబు సతీమణి పద్మజ అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల్లో ఆలయ చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు పాల్గొన్నారు. ఆలయ ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు.

వారాహి అవతారంలో పద్మాక్షీదేవి



హన్మకొండ అర్బన్: ఆషాఢమాసం శాకంబరీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు (శుక్రవారం) నగరంలోని పద్మాక్షి కాలనీలోని శ్రీ హనుమద్గిరి పద్మాక్షీదేవి వారాహి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని, నాగిళ్ల శంకర్‌శర్మ ఉదయం అమ్మవారికి పూర్ణాభిషేకం నిర్వహించి వారాహి మాతగా అలంకరించారు. మంత్రపుష్పం నామ సంకీర్తన నిర్వహించారు. జూలై 10వ తేదీ వరకు నిర్వహించే శాకంబరీ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పద్మాక్షి దేవిని దర్శించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ సభ్యులు సదానందం, రాజ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు



సీఎండీ వరుణ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన డైరెక్టర్లు

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలోని శుక్రవారం టీజీ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. ఫైనాన్స్ డైరెక్టర్‌గా వంటేరు తిరుపతి రెడ్డి, ఆపరేషన్స్ డైరెక్టర్‌గా టి.మధుసూధన్, ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా వంగూరు మోహన్ రావు, హెచ్ఆర్‌డీ అండ్ ఐఆర్ డైరెక్టర్‌గా సి.ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించగా.. సీఎండీ వారికి శుభాకాంక్షలు తెలిపారు. సమిష్టి కృషితో కంపెనీని అభివృద్ధి పథంలో తీసుకెళ్దామని అన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ.. సీఎండీ వరుణ్ రెడ్డి సారథ్యంలో కంపెనీ అభివృద్ధిలో భాగస్వాములవుతామని, వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన డైరక్టర్లను అసోషియేషన్లు, యూనియన్ల నాయకులు, ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఇతర అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దపల్లి రైల్వే వంతెన ఘటనతో రైళ్లకు అంతరాయం

- తెలంగాణ రీ షెడ్యూల్, సింగరేణి వరంగల్ వరకే
- ఇబ్బంది పడ్డ ప్రయాణికులు

కాజీపేట రూరల్: పెద్దపల్లి రైల్వే వంతెన (ఆర్వోబీ) ఘటనతో శుక్రవారం పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనతో కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్–బల్లార్షా రూట్‌లో ప్రయాణించే పలు రైళ్లకు గంటల తరబడి ఆలస్యం తలెత్తింది. బల్లార్షా–సికింద్రాబాద్ వెళ్లే భాగ్యనగర్, సికింద్రాబాద్– సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్లే ఇంటర్ సిటీ, సికింద్రాబాద్– దానాపూర్ వెళ్లే ధానాపూర్ ఎక్స్‌ప్రెస్ నిర్ణీత సమయం కన్నా గంటల తరబడి ఆలస్యంగా చేరుకున్నాయి. దానాపూర్‌ను ఘన్‌పూర్ స్టేషన్‌లో నిలిపివేయడంతో కాజీపేటకు గంట ఆలస్యంగా చేరుకుంది. అదేవిధంగా న్యూఢిల్లీ–హైదరాబాద్ వెళ్లే తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 3 గంటలు, కాగజ్‌నగర్– సికింద్రాబాద్ వెళ్లే ఇంటర్ సిటీ 2 గంటలు, కాగజ్‌నగర్– సికింద్రాబాద్ వెళ్లే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ 2:30 గంటలు రీ షెడ్యూల్ చేసినట్లు, భద్రాలచంరోడ్–సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్లే సింగరేణి ప్యాసింజర్‌ను వరంగల్ వరకే అప్ అండ్ డౌన్ రూట్‌లో నడిపించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల ఆలస్యం, రీ షెడ్యూల్‌తో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, కాజీపేట రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ విజయ్‌కుమార్, కాజీపేట రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ ప్రయాణికులకు రైళ్ల రాకపోకలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించారు.



ఉప్పల్ రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయిన ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్

ఉప్పల్‌లో ఐదు గంటలు నిలిచిన ఇంటర్‌సిటీ..

కమలాపూర్: హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్తున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం సుమారు ఐదు గంటల పాటు నిలిచిపోయింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్తున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు ఉప్పల్‌కు సుమారు 8–30 గంటలకు చేరుకుందని తెలిపారు. గంట, రెండు, మూడు, నాలుగు గంటలు గడిచినా రైలు ముందుకు కదలకపోవడంతో రైల్వే అధికారులను అడిగితే పెద్దపల్లి వద్ద ఆర్వోబీ పనులు జరుగుతున్నాయని, ఈ క్రమంలో గడ్డర్లు అమరుస్తున్న క్రమంలో ఓ గడ్డర్‌కు సంబంధించిన వస్తువు కిందకు జారిందని, దీంతో ఎలాంటి ప్రమాదం జరుగకుండా ముందు జాగ్రత్త చర్యగా ఎక్కడి రైళ్లను అక్కడే నిలిపి వేశారని చెప్పినట్లు తెలిపారు. చివరికి మధ్యాహ్నం 1–30 ప్రాంతంలో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు ముందుకు కదిలింది.

పలు రైళ్లు రద్దు, దూరం తగ్గింపు, రీషెడ్యూల్

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ సబ్ డివిజన్ పరిధిలో ఆపరేషనల్ రీసన్స్‌తో శుక్రవారం పలు రైళ్ల రద్దు, రీ షెడ్యూల్, పార్షల్లీ రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శుక్రవారం తెలిపారు.

రద్దయిన రైళ్లు

శుక్రవారం బల్లార్షా–కాజీపేట (17004) రా మగిరి, కరీంనగర్–సిర్పూర్ టౌన్ (67772) పుష్‌పుల్, సిర్పూర్‌టౌన్– కరీంనగర్ (67771) పుష్‌పుల్‌లను రద్దు చేశారు.

దూరం కుదించిన రైళ్లు

భద్రాచలం–బల్లార్షా (17033) సింగరేణి, కాజీపేట –సిర్‌పూర్‌టౌన్ (17003) ప్యాసింజర్, సిర్పూర్‌టౌన్–భద్రాచలం (17034) సింగరేణి, హైదరబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్(17012) ఇంటర్‌సిటీ, సిర్పూర్ కాగజ్‌నగర్–బీదర్ (17012) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–సిర్‌పూర్‌కాగజ్‌నగర్ (12757) ఇంటర్‌సిటీ, సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (12758) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (17234) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–గుంటూర్ (17202) ఎక్స్‌ప్రెస్‌ను దూరం తగ్గించినట్లు తెలిపారు.

రీ షెడ్యూల్

సికింద్రాబాద్–నాగపూర్ (20102) ఎక్స్‌ప్రెస్‌ను 3 గంటలు రీషెడ్యూల్‌తో నడిపిస్తున్నట్లు తెలిపారు.

హక్కుల పరిరక్షణలో ఓంకార్ పాత్ర ఎనలేనిది

- మోదీ పాలన దేశానికే ప్రమాదకరం
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేష్

వరంగల్ చౌరస్తా: పౌర హక్కులు.. రాజ్యాంగ పరిరక్షణ కోసం మాజీ ఎమ్మెల్యే ఓంకార్ చేసిన ఉద్యమాలు, త్యాగాలు ఎనలేనివని పలువురు వక్తలు తెలిపారు. వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాల్లో భాగంగా పౌర హక్కుల పరిరక్షణలో ఆయన పాత్ర అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పెదారపు రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఎం జిల్లా నాయకురాలు నలిగంటి రత్నమాల, న్యూ డెమోక్రసీ గ్రేటర్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, నాయకులు సున్నా అప్పరావు, లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కనపెల్లి యాదగిరి, రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు సోమ రామమూర్తి, కేడల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీ నాయకులను అక్రమంగా జైలులో పెడుతుందని ఆరోపించారు. బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నాని అన్నారు. అడవిలోని ఆదివాసీలను కాల్చి చంపుతూ.. అటవీ సంపద కార్పొరేట్ పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు అనేక కుట్రలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు నర్ర ప్రతాప్, కుసుంబ బాబురావు, జగదీశ్వర్, నలిగంటి చంద్రమౌళి, రాజన్న, అనిత, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లోనే పీవీ..

కళ తప్పిన వంగర గ్రామం
- నేడు పీవీ నర్సింహారావు జయంతి
- వంగరలో తుదిదశకు చేరుకున్న పీవీ విజ్ఞాన కేంద్రం పనులు



ఎల్కతుర్తి: అభివృద్ధి లేమి.. అప్పుల ఊబిలో కూనరిల్లుతున్న తరుణంలో అన్నీ తానై ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశాన్ని ప్రగతిబాట పట్టించారు.. నాటి ప్రధాని పీవీ నర్సింహారావు. హనుమకొండ జిల్లా భీమదేవపల్లి మండలంలోని వంగర అనే ఒక చిన్న గ్రామం నుంచి ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగిన గొప్ప మేధావి పీవీ నర్సింహారావు. పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో వంగర గ్రామం ఓ వెలుగు వెలిగింది. ఆ సమయంలోనే గ్రామంలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. నేడు దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 104వ జయంతి.

భీమదేవరపల్లి మండలం వంగరలో 1921 జూన్ 28న పీవీ జన్మించారు. రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవులతోపాటు ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రిగా పదవులకు వన్నెతెచ్చారు. పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో వంగరలో ముమ్మరంగా అభివృద్ధి పనులు చేపట్టారు. పోలీస్‌స్టేషన్ మంజూరైంది. రక్షిత తాగునీటి బావి, పీవీ మోడల్ కాలనీ, బాలికల గురుకుల పాఠశాల, 24 గంటలు పనిచేసే ఆస్పత్రి, సబ్‌స్టేషన్ మంజూరయ్యాయి. ఓ వైపు దేశం, మరో వైపు కాంగ్రెస్ పార్టీ దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న తరుణంలో పీవీ ప్రధానిగా ఎన్నికయ్యారు. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న దేశాన్ని తలెత్తుకునేలా చేయడంతోపాటు భారత ఖ్యాతిని దేశ విదేశాల్లో ఇనుమడింపజేసిన ఘనత పీవీదే. కాగా, 2004 డిసెంబర్ 23న పీవీ తుదిశ్వాస విడిచారు. పీవీ మరణానంతరం అయనను సొంతపార్టీ పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. పీవీ నర్సింహారావు ఇంటిని మ్యూజియంగా మారుస్తామని హామీ ఇచ్చిన గత ప్రభుత్వం నెరవేర్చలేకపోయింది. పీవీ సొంతగ్రామంలో విగ్రహం ఏర్పాటు చేయకపోవడంతో చివరకు గ్రామస్తులే చందాలు వసూలు చేసుకొని విగ్రహాన్ని ప్రతిష్ఠించడం గమనార్హం.



నిర్మాణంలో ఉన్న పీవీ విజ్ఞాన కేంద్రం

నెరవేరని హామీలు..

హనుమకొండ– సిద్దిపేట రహదారిలో వంగర క్రాస్ నుంచి గ్రామంలోకి వెళ్లే దారిలో స్వాగత తోరణం, పీవీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు నాలుగు లైన్ల రహదారి నిర్మించి, సెంట్రల్ లైటింగ్ తీర్చిదిద్దేందుకు అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కానీ, నేటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి వంగరలో అభివృద్ధి పనుల వేగం పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తుది దశలో పీవీ విజ్ఞాన కేంద్రం పనులు

వంగర గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని రెండేళ్ల క్రితమే ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా అప్పటి సీఎం కేసీఆర్ రూ.11 కోట్లు మంజూరు చేసి పనులను ప్రారంభించారు. పీవీ విజ్ఞాన వేదిక పార్కు నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. పీవీ విజ్ఞాన వేదికలో ప్రవేశ ద్వారం, ఫుడ్‌కోర్టు, ఫొటో గ్యాలరీ, పీవీ జీవిత విశేషాలకు సంబంధించిన చిత్రాలు ఉండేలా రూపకల్పన చేశారు. దీంతోపాటు ధ్యాన మందిరం, సైన్స్ మ్యూజియం, అంపీ థియేటర్, వాటర్ ఫౌంటేషన్, చారిత్రక శిల్పాలు, పార్క్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించారు. పీవీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రారంభించాలని గత ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, అప్పటి నాయకులు పట్టించుకోకపోవడంతో పనులు నత్తనడకన కొనసాగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మంత్రి పొన్నం ప్రభాకర్.. పీవీ విజ్ఞాన కేంద్రం నిర్మాణం పనులను వేగవంతం చేశారు. దీంతో నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి.

స్నాతకోత్సవానికి సమన్వయంతో పనిచేయాలి

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



కమిటీల బాధ్యులతో సమీక్షిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: జూలై 7న నిర్వహించనున్న కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం నిర్వహణకు సమన్వయంతో పనిచేయాలని కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి ఆయా కమిటీల కన్వీనర్లు, మెంబర్లను కోరారు. ఇప్పటికే స్నాతకోత్సవం నిర్వహణకు ఐదుగురు ప్రొఫెసర్లతో కూడిన స్టీరింగ్ కమిటీ, 10 సబ్ కమిటీలను కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం నియమించారు. అన్ని కమిటీల కన్వీనర్లతో శుక్రవారం క్యాంపస్‌లోని అకాడమిక్ కమిటీ హాల్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, హైదరాబాద్‌లోని ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. స్నాతకోత్సవం స్టీరింగ్ కమిటీ మెంబర్ కన్వీనర్ ఆచార్య రాజేందర్ మాట్లాడుతూ.. ఇప్పటికే 331 మంది విద్యార్థులు పీహెచ్‌డీ పట్టాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. 374 మంది విద్యార్థులకు 564 బంగారు పతకాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్నాతకోత్సవ నిర్వహణకు సంబంధించిన విషయాలను ఆయన వివరించారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, స్టీరింగ్ కమిటీ చైర్మన్ ఆచార్య మల్లారెడ్డి, యూనివర్సిటీ కాలేజీ ప్రొఫెసర్ మనోహర్, ప్రొఫెసర్ వెంకట్రామ్ రెడ్డి, ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి, అమరవేణి, ప్రొఫెసర్ నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ శ్రీలత, ప్రొఫెసర్ షమిత, ప్రొఫెసర్‌వై వెంకయ్య, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ టూర్ ప్యాకేజీని వినియోగించుకోవాలి

- డిప్యూటీ ఆర్ఎం భాను కిరణ్

హన్మకొండ: పర్యాటకులు ఆర్టీసీ టూర్ ప్యాకేజీని వినియోగించుకోవాలని ఆర్టీసీ వరంగల్ రీజినల్ డిప్యూటీ ఆర్ఎం కేశరాజు భాను కిరణ్ అన్నారు. ఆర్టీసీ టూర్ ప్యాకేజీలో భాగంగా శుక్రవారం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లో బొగత జలపాతానికి బయల్దేరిన రెండు ఆర్టీసీ బస్సులను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. నాగార్జునసాగర్, బొగత జలపాతం, శ్రీశైలం, పాండవుల గుట్టలు, కాళేశ్వరం దేవాలయం, కాళేశ్వరం ప్రాజెక్టు, వేములవాడ, కొండగట్టు, కానిపాకం, అరుణాచలం, జోగులాంబ ప్రదేశాలకు ఆర్టీసీ టూర్ ప్యాకేజీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్స్ ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను ఈ టూర్‌కు సమకూరుస్తున్నామన్నారు. 30 మంది ఉంటే బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 89777 81103, 94938 82464, 95730 90136 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ నాయక్, ఉద్యోగులు, పర్యాటకులు పాల్గొన్నారు.